# సారీ...

ఆఫీస్‌లోకి అడుగుపెట్టి అరగంటకూడా కాలేదు. సెల్ మోగింది. కళ్ళద్దాలు సరిచేసుకుని నంబర్ చూశాను. యింటినుంచి ఫోన్.. సుజాత నాకు ఫోన్ చేయటం చాలా అరుదు. ముప్పయ్యేళ్ళ కాపురంలో మహాఐతే డజనుసార్లకి మించి ఫోన్ చేసి ఉండదు... అదీ అత్యవసరమైతే తప్ప.. కంగారుగా "హలో" అన్నాను.

"గుండెల్లో నొప్పిగా ఉందండి. చెమటలు కూడా పట్టున్నాయి. నాకు భయంగా ఉంది. మీరు తొందరగా వచ్చేయండి" సుజాత గొంతులో వణుకు...

గుండెనొప్పా... సుజాతకా... యాభయ్ నాలుగేళ్ళ వయసులో కూడా సన్నగా నాజూగ్గా నలభైయేళ్ళ స్త్రీలా కన్పిస్తూ తన ఈడువాళ్ళలో చాలామంది ఈర్ష్యకి కేంద్రమైన సుజాతకి గుండె నొప్పంటే నమ్మశక్యం కావటం లేదు.

"మొదట ఆటో మాట్లాడుకుని అపోలో హాస్పిటల్ కెళ్ళు. తాత్సారం చేయకు. నేనొచ్చేవరకు ఆగటం మంచిది కాదు. నామాటిను. వెంటనే బయల్దేరు" అన్నాను.

"పర్లేదు. మీరు పక్కన లేకుండా నేనీ హాస్పిటళ్ళ చుట్టూ తిరగలేను. ఏం కాదులెండి. అమృతాంజనంతో మర్దన చేసుకుంటాను."

"అయ్యో చెప్తుంటే అర్థం కాదా నీకు? చదువుకున్న దానివేగా. ప్రమాదమని తెలీదా? పక్క పోర్షన్లో వాళ్ళనెవర్నయినా తోడు తీసుకుని వెళ్ళు. ప్లీజ్...ఆలస్యం చేయకు"

"మీరు లేకుండా నేనెక్కడికి వెళ్ళను. మీరు తొందరగా రండి."

"వాదనొద్దు. పక్కింటివాళ్ళనెవర్నయినా తోడు తీసుకుని...." మరో మాటకు అవకాశం యివ్వకుండా ఫోన్ పెట్టేసింది.

మళ్ళా ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. సుజాత మొండితనం తెల్సినవాణ్ణి కాబట్టి పర్మిషన్ తీసుకుని బైటపడ్డాను. సుజాతలో ఆ మొండితనమే నాకు నచ్చనిది. ఆటో మాట్లాడుకుని అపోలో హాస్పిటల్‌కి వెళ్ళొచ్చుకదా... నేను యింటికెళ్లే లోపల జరక్కూడనిదేదైనా జరిగితే... ఆ ఆలోచనకే వణుకొచ్చింది. గుండె బరువెక్కింది.

స్కూటర్ని వీలైనంత వేగంగా పోనిస్తున్నాను. మా ఆఫీస్ నుండి యింటికి దాదాపు పావు గంట ప్రయాణం... ట్రాఫిక్ ఎక్కువైతే యిరవై నిముషాలు పట్టినా పట్టొచ్చు.

వేగంగా వెళ్తున్న స్కూటర్ని ఓ కానిస్టేబుల్ చేయి అడ్డంపెట్టి ఆపాడు. నాతోపాటు మిగతావాళ్ళని కూడా ఆపేశాడు. ఎందుకా అని చూశాను. ఎడం చేతివైపు పోలీస్ స్టేషన్ ఉంది. అందులోంచి పోలీస్ వాహనం బైటికొస్తోంది. దాని కోసమని ట్రాఫిక్‌ని ఆపేశాడు.

అసహనంతో పాటు కోపం వచ్చింది. ఎంత అధికార దుర్వినియోగం!

అది డి.జి.పి కారో లేక నగర పోలీస్ కమీషనర్ కారో ఐతే తప్పదనుకోవచ్చు. అనుమాన నివృత్తి కోసమని ఆ కానిస్టేబుల్‌నే అడిగాను.

"మా సర్కిల్ గారు" అన్నాడు తన దేగకన్నుని ఆగిన ట్రాఫిక్ వైపు మరల్చి మళ్ళా కదుల్తోన్న వాహనంలో కూచుని ఉన్న సర్కిల్ వైపుకు చూస్తూ...

సర్కిల్‌గారి వాహనం గేటు దాటబోతున్నపుడు డ్రైవర్ బండినాపాడు... యింజన్ ఆఫ్ చేయలేదు. ఓ ఎస్సయ్ పరుగెత్తుకుంటూ వాహనం దగ్గరకొచ్చాడు. సర్కిల్ అతనికేదో చెప్తుంటే వినయంగా తల వూపుతూ వింటున్నాడు.

నాలో అసహనం క్షణక్షణానికీ పెరుగుతోంది.

యిక్కడ యింతమందిని తన పోలీసు కానిస్టేబుల్ ఆపేశాడన్న యింగితం కూడా లేకుండా ఈ నగరం తన జాగీరైనట్లు... తాపీగా మాట్లాడుతున్నాడు సర్కిల్...

అక్కడేమీ ట్రాఫిక్ సిగ్నల్ లేదు... బాధ్యతగల పౌరుడిగా ఆగిపోవడానికి... నాలో చిరాకు. యిక ఆగలేక స్కూటర్ని ముందుకు పోనిచ్చాను.

"ఏయ్... ఆగు" అంటూ కానిస్టేబుల్ నా వెనక వేగంగా పరుగెత్తి స్కూటర్ వెనక పట్టుకున్నాడు.

"నీకేమైనా మెంటలా... స్కూటర్ పక్కకు తీయ్" అన్నాడు కరుగ్గా.

అరవైకి దగ్గరవుతున్న వయసు.. యిద్దరు కొడుకులు అమెరికాలో పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడ్డారు... గౌరవప్రదమైన ఉద్యోగం చేస్తున్నాను... నాకు వూహ తెలిశాక ఎవ్వరూ నన్నామాట అనలేదు. ఆ కానిస్టేబుల్ వయసు నా కొడుకు వయసు కన్నా తక్కువ ఉంటుంది.

"మాటలు జాగ్రత్తగా రానీ" అన్నాను.

"నువ్వు మొదట పక్కకు తీసి ఆపు. నీ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ తీయ్. మా సి.ఐ గారు వెళ్ళనీ... నీ సంగతి చెప్తాను" అన్నాడు. ఈలోపల మరో కానిస్టేబుల్ వచ్చి నా బండి పక్కన నిలబడ్డాడు.

సి.ఐ కూచున్న వాహనం కదిలింది. అందులోంచి సి.ఐ నా వైపు క్రూరంగా చూస్తూ వెళ్ళటం గమనించాను.

అతని వాహనం వెళ్ళాక ట్రాఫిక్ మళ్ళా కదిలింది.

మొదటి కానిస్టేబుల్ నా దగ్గరకొచ్చి "స్టేషన్లోకి పద. నీ దగ్గర బండికి సంబంధించిన కాగితాలన్నీ చెక్ చేయాలి" అన్నాడు.

"దానికి స్టేషన్లోకి ఎందుకు? యిదుగో పేపర్లు. చెక్ చేసుకో"

అతను వాటిని చాలా పరిశీలనగా చూశాడు. "పొల్యూషన్ సర్టిఫికేటేది" అన్నాడు.

అది లేదని నాకు తెలుసు. నాలుగు నెల్ల క్రితం రెన్యూ చేయాల్సింది... ఏవో పనుల్లోబడి మర్చిపోయాను.

"లేదు. ఎంత పెనాల్టీ కట్టాలో చెప్పండి. కట్టేస్తాను"

"దొరగారికి తొందరెక్కువనుకుంటా(న్రా... యిందాక కూడా ట్రాఫిక్ ఆపినా ఇతనెలా స్కూటర్‌తో ఉరికాడో చూశావుగా. పోలీసులంటే లెక్కలేకుండా పోయింది నాకొడుకులకి" మరో కానిస్టేబుల్‌తో అన్నాడు. నా కొడుకులకి అనే పదాన్ని మంద్రస్థాయిలో పలుకుతూ...

"నోరు సంబాళించుకుని మాట్లాడు. పిచ్చిపిచ్చిగా వాగావంటే నీమీద పరువు నష్టం దావా వేస్తాను" కోపంగా అన్నాను.

"ట్రాఫిక్ రూల్స్‌ని అతిక్రమించినందుకు ఆపిన కానిస్టేబుల్ మీద పరువు నష్టం

దావా వేస్తావా... వేయి చూద్దాం... ఏమని వేస్తావో"

"అందుక్కాదు. నువ్వు వాడిన అన్‌పార్లమెంటరీ భాషకి"

"ఏమన్నానూ... నేనేమీ అనలేదే. డ్రైవింగ్ లైసెన్స్ చూపుంచమన్నా. అదేమన్నా తిట్టా"

"నువ్వు తిట్టింది నేను స్పష్టంగా విన్నాను"

"సరే... ఏమని తిట్టాను? ఏం రుజువుంది నీ దగ్గర?"

"నీతో నాకు వాదన అనవసరం.నువ్వు చలాన్ రాయి. నేను కట్టేసి వెళ్ళిపోతాను"

"మా సి.ఐ వచ్చేవరకు ఉండాలి" అంటూనే ఆ కానిస్టేబుల్ నా స్కూటర్ని నడుపుకుంటూ స్టేషన్లోకి తీస్కెళ్ళి పోయాడు.

అప్పటికి దాదాపు యిరవై నిముషాలు గడిచిపోయాయి. నాలో ఆదుర్దా..సుజాతకెలా ఉందోనని... ఏదో తెలీని గుబులు... ఆలసయమయ్యేకొద్దీ గుండెల్లో గూడు కట్టుకుంటున్న దిగులు...

"సరే. స్కూటర్ మీస్టేషన్లోనే ఉంచుకోండి. నేను తొందరగా వెళ్ళాలి" అంటూ రెండడుగులు వేశాను. రెండో కానిస్టేబుల్ నాకు అడ్డుగా నిలబడ్డాడు.

"తమాషా చేస్తున్నావా... నీ యిష్టమేనా... మరి మేమేందుకున్నాం యిక్కడ... నువ్వెళ్ళడానికి వీల్లేదు. మా సి.ఐ గారు వచ్చేవరకు ఉండాల్సిందే" అన్నాడు.

"నన్ను ఆపే అధికారం నీకు లేదు. తప్పు చేసింది మీరు. సి ఐ వెహికిల్ కోసం ట్రాఫిక్‌ని ఆపమని మీ ప్రొటోకోల్ డ్యూటీల్లో ఉందా?"

"రూల్స్ మాట్లాడుతున్నావే... మాకూ కొన్ని రూల్స్ తెలుసు. నువ్వు మాదకద్రవ్యాలు రవాణా చేస్తున్నట్టు సమాచారం అందిందనీ అనుమానం మీద ఆపి ప్రశిస్తున్నామనీ అంటాం. ఎలా పోతావో పో చూద్దాం. నువ్వు పారిపోయావని చెప్తాను. అనుమానం కాస్తా నిజమై కూచుంటుంది" వాడు వంకరగా నవ్వుతున్నాడు.

నాకు కోపంతో పాటు దుఃఖం, దుఃఖంతోపాటు ఏడుపు తన్నుకొస్తున్నాయి.

"నువ్వు అఫ్టరాల్ పోలీస్ కానిస్టేబుల్‌వి. నీపైన చాలా మంది అధికారులుంటారు.

వాళ్ళతోనే మాట్లాడతాను. స్టేషన్లో ఎస్సయ్ ఉంటాడుగా. నీ సంగతేంటో యిపుడే తేల్చేస్తాను" అంటూ ఆవేశంగా స్టేషన్లో కెళ్ళాను. నా వెనకే అతనూ వచ్చాడు.

సబ్‌యిన్‌స్పెక్టర్ దగ్గరకెళ్ళి "నేను ప్రభుత్యోద్యోగిని. నన్ను పట్టుకుని మాదక ద్రవ్యాలు రవాణా చేస్తున్నావని కేసులో యిరికిస్తానని మీ కానిస్టేబుల్ బెదిరిస్తున్నాడు. యిదేమైనా న్యాయంగా ఉందా" అని అడిగాను.

అతను నా వైపు నిర్లక్ష్యపు చూపొకటి విసిరాడు. "ఏం ప్రభుత్యోద్యోగులైతే అలాంటి పనులు చేయరని నీకు తెలుసా... గవర్నమెంట్ జాబ్ చేస్తూ లుచ్ఛా పనులు చేసే నాయాళ్ళని యింతమందిని చూపిస్తాను" అన్నాడు తన జుట్టుని పిడికిట్లో పట్టుకుంటూ...

"సరే. నేను వెంటనే యింటికెళ్ళాలి. నా భార్యకు ఆరోగ్యం బాగాలేదు. హాస్పిటల్ కి పిల్చుకెళ్ళాలి"

"ఓహో... మా కానిస్టేబుల్ ఆపినా సరే ఆగకుండా వెళ్ళినందుకు అతికేలా కారణం వెతికి చెప్తున్నావా... నేను మా సి.ఐతో మాట్లాడ్తూనే నిన్నో కంట గమనించాను. మీకు రెండు కళ్ళే... మాపోలీసోళ్ళకి వంద కళ్ళు. మా సి.ఐ వచ్చేదాకా ఉండు. వారు పర్మిషన్ యిస్తే వెళ్దువుగానీ"

"ఎపుడొస్తారు?"

"ఏమో తెలీదు. అరగంట పట్టొచ్చు... గంట పట్టొచ్చు"

"ఏ తప్పు చేయకుండా నన్ను అక్రమంగా నిర్బంధించడానికి మీకేం అధికారముంది? నేను మీ ఏ.సి.పికి కంప్లెయింట్ చేస్తాను."

"ఏ.సి.పి ఏం ఖర్మ, మా డి.జి.పికి, కావాలంటే హోం మినిష్టర్ కి కూడా కంప్లెయింట్ చేసుకో. నీ యిష్టం" అన్నాడతను విలన్లా క్రూరంగా నా వైపు చూస్తూ...

బైటికొచ్చి నిలబడ్డాను. యిప్పటికే ముప్పావుగంట నుంచీ ఈ ప్రహసనం నడుస్తోంది. మరో పదిహేను నిముషాలు ముళ్ళమీద ఉన్నట్లు నిలబడ్డాను. సి.ఐ వస్తున్న జాడే కన్పించలేదు.

యిక వాళ్ళు పట్టుకుని జైల్లో వేసినా సరే ఉండలేననిపించింది. వెనక్కి తిరిగి చూడకుండా వేగంగా రోడ్డుమీదికొచ్చాను. ఎవ్వరూ ఆపలేదు. కానీ వెనకనుంచి నవ్వుకోవటం

మాత్రం విన్పించింది.

ఆటో మాట్లాడుకుని యింటికి బయల్దేరాను. మధ్య దారిలో నా మొబైల్ నుంచి రెండుసార్లు యింటికి ఫోన్ చేశాను. జవాబు లేదు. హాస్పిటల్‌కి వెళ్ళి ఉంటుందేమో. ఉండికూడా ఎత్తడం లేదేమోనన్న అనుమానం.... మరీ అంత మొండితనమేంటీ... వస్తున్నాగా... కంగారు పడ్తుంటానని తెలిసికూడా ఫోన్ ఎత్తకపోతే ఏమనాలి? నేననవసరంగా ఆందోళన పడ్తున్నానేమో... నొప్పి తగ్గిపోయిందేమో... ఎందుకో ఆ ఆలోచన సరికాదనిపించింది. అలా జరిగి ఉంటే తప్పకుండా నా సెల్‌కి ఫోన్‌చేసి చెప్పి ఉండేది. కాబట్టి నొప్పి తగ్గి ఉండదు.

యింటికి తాళం వేసి లేదు. మెల్లగా తలుపు నెట్టాను. తెర్చుకుంది. హాల్లోకి రాగానే కన్పించిన దృశ్యం చూసి స్థాణువైపోయాను. సుజాత నేలమీద పడిపోయి ఉంది.

దగ్గరకెళ్ళి "సుజాతా... సుజాతా" అంటూ కదుపుతూ పెద్దగా పిలిచాను. చలనం లేదు. అప్పుడొచ్చింది అనుమానం... చనిపోయి ఉంటుందా... భగవంతుడా... అలా జరిగితే నేను తట్టుకోలేనే... భయం భయంగా ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాను. శ్వాస ఆడటంలేదని తెల్సినవెంటనే నా గుండె పట్టేసినట్లయింది. శ్వాస ఆగిపోయినట్లు గిలగిలా కొట్టుకున్నాను. నా జీవితంలో ఎప్పుడూ నేనంత పెద్దగా ఏడ్వలేదు.

* * *

నేనొస్తానని సుజాత ఎదురు చూసి ఉంటుంది. నా ఆలస్యం వల్లనే చచ్చిపోయింది. నా భార్యది ఓ రకంగా హత్య...ఆ రోజు నన్నాపిన పోలీసులదే పాపం... వాళ్ళని వూరికే వదలదల్చుకోలేదు. వాళ్ళు చేసిన నేరానికి శిక్ష పడాల్సిందే. కర్మకాండలన్నీ ముగిశాక మొదట ఆ స్టేషన్‌కి సంబంధించిన ఏ.సి.పిని కలిసి వ్రాతపూర్వకంగా కంప్లెయింట్ రాసిచ్చాను. ఓ వారం తర్వాత వెళ్ళి కలిశాను.

"రిపోర్ట్ కాల్‌ఫర్ చేశాను. యింకా రాలేదు. అక్కడి సి.ఐ తో మాట్లాడాను. అతను వోరల్‌గా చెప్పినదాన్నిబట్టి తన కానిస్టేబుల్స్ ఎవర్నీ అనవసరంగా ఆపరనీ, ఆపలేదని అంటున్నాడు. ఏనీవే రిటెన్ రిపోర్ట్ రానివ్వండి. చూద్దాం" అన్నాడు.

నాలుగు రోజులాగి మళ్ళా వెళ్ళాను. లేడు. బైటికెళ్ళాడట. రెండున్నర గంటలు ఎదురుచూసి వెళ్ళిపోయాను. మరోసారి వచ్చినపుడు క్యాంప్ కెళ్ళాడని తెలిసింది. మూడోసారి

వెళ్ళినపుడు ఉన్నాడు. నన్ను చూసి విసుగ్గా మొహం పెట్టాడు. "రిపోర్ట్ యింకా రాలేదు. మీ నంబర్ ఉందిగా. మేమే కాంటాక్ట్ చేస్తాం" అన్నాడు. అంటే యింక వాళ్ళనుంచి ఫోనొచ్చేవరకు రావొద్దని స్పష్టంగా చెప్పాడన్మాట.

మరో పది రోజులు ఎదురు చూశాను. ఫోన్ రాలేదు. నేనే వెళ్ళా. ఈసారి నావైపు కోపంగా చూశాడు. "ఎందుకిలా మా విలువైన సమయాన్ని వేస్ట్ చేస్తారు? మాకు వేరే పన్లేం లేవనుకుంటారా" అన్నాడు.

"మీరేకాదు నేనూ ప్రభుత్యోద్యోగినే అన్న విషయం మర్చిపోయినట్టున్నారు. మీదే కాదు అందరి సమయం విలువైందే. నేను కంప్లెయింట్ యిచ్చిన విషయం కూడా అదే. ఎదుటి వ్యక్తి సమయం యొక్క విలువ తెల్సుకోకుండా మీ పోలీసులు నన్ను గంటకు పైగా కదలకుండా చేశారు. నా ఆలస్యానికి నేను చెల్లించుకున్న మూల్యం నా భార్య ప్రాణం" నేనూ కోపంగా సమాధానం యిచ్చాను.

ఏమనుకున్నాడో ఏమో నా ఎదురుగానే ఆ సి.ఐ తో మాట్లాడాడు. "మీరు ఎల్లుండి రండి. అప్పటికి రిపోర్ట్ పంపిస్తానన్నాడు. దాన్ని చూశాక ఫర్దర్ యాక్షన్ ఏం తీసుకోవాలో ఆలోచిస్తాను" అన్నాడు.

రెండ్రోజులాగి వెళ్ళాను. నన్ను చూడగానే ఓ ఫైల్ తెరిచి అందులోని పేపర్లను చూస్తూ చెప్పాడు. "సి.ఐ యిచ్చిన రిపోర్ట్ ప్రకారం మీరు రాంగ్‌రూట్లో వస్తుంటే పట్టుకుని బండికి సంబంధించిన పేపర్లు వెరిఫై చేశారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోవటం వల్ల చలాన్ రాశారు. కానీ మీరు చలాన్ తీసుకోడానికి నిరాకరించి, స్కూటర్ని అక్కడే వదిలి వెళ్ళిపోయారు. యిందులో మా డిపార్ట్‌మెంట్‌వాళ్ళు చేసిన తప్పేముంది? మిమ్మల్ని గంటకు పైగా కదలకుండా నిర్బంధించినట్టు మీ దగ్గర ఏమైనా ఎవిడెన్స్ ఉంటే చూపించండి. యాక్షన్ తీసుకుంటాను. సారీ... ప్రస్తుతానికి నేనేం చేయలేను" అన్నాడు.

అతన్తో యిక మాట్లాడటం అనవసరమనిపించి తిరిగొచ్చేశాను. మా ఆఫీసర్‌కి తెల్సినవాళ్ళద్వారా కమీషనర్ గారిని కల్సుకుని నాకు న్యాయం చేయమని అర్థించాను. వారు చాలా సానుకూలంగా స్పందించారు. సకాలంలో వైద్యం అందక నా భార్య చనిపోయిందని విని సానుభూతి తెలియచేశారు. నిజానిజాలు తెల్సుకుని కానిస్టేబుల్ తప్పు చేసినట్లు రుజువైతే అతన్ని శిక్షిస్తానన్నాడు.

మూడువారాలు తిరిగాక, ఓ రోజు పోలీస్ కమీషనర్ గారి ఆఫీసుకు రమ్మని కబురొచ్చింది. నేను వెళ్ళేటప్పటికే బైట ఆ కానిస్టేబుల్ నిలబడి ఉన్నాడు. నన్నో వింత పురుగుని చూసినట్లు చూసి తల తిప్పుకున్నాడు.

నేను లోపలికెళ్ళి కమీషనర్‌గార్ని కలిశాను.

"ఆ పోలీస్ స్టేషన్లో సి.ఐ చెప్తున్నదానికీ మీరిచ్చిన కంప్లెయింట్‌కి పొంతనే లేదు. నేను ఆ సి.ఐనీ మిగతా సిబ్బందిని పిలిచి మాట్లాడాను. వాళ్ళందరూ మీదే తప్పంటున్నారు. మిమ్మల్ని కదలకుండా ఆపలేదంటున్నారు. ఏనీవే నేను వాళ్ళ మాటలు నమ్మటం లేదు. వాళ్ళ తప్పు లేకపోతే మీరింత పట్టుదలగా న్యాయంకోసం శ్రమ పడరు. రుజువులు లేకున్నా మా కానిస్టేబుల్ వల్ల మీరు అసౌకర్యానికి గురయ్యారని నమ్ముతున్నాను కాబట్టే అతన్ని పిలిచి చీవాట్లు పెట్టాను. అతన్నికూడా పిలుస్తానుండండి" అంటూ బెల్ కొట్టి ఆ కానిస్టేబుల్‌ని లోపలికి పంపించమని చెప్పాడు.

అతను లోపలికి రాగానే అమాంతం వొంగిపోయి కమీషనర్ గారికి దండాలు పెట్టాడు. "నువ్వు అబద్ధం చెప్తున్నావని నాకు తెలుసు. యితని విషయంలో నువ్వు అన్యాయంగా ప్రవర్తించావు. రుజువులు లేవు కాబట్టి బతికి పోయావు. లేకపోతే సస్పెండ్ చేసి పడేసేవాణ్ణి" కమీషనర్ గారు చాలా కోపంగా మాట్లాడారు.

"సారీ సర్. పొరపాటైపోయింది సార్... సారీ సార్" అతను పదే పదే యివే మాటలు తిప్పితిప్పి చెప్తున్నాడు.

"సరే... వెళ్ళు" అని కమీషనర్ అనగానే అతను నా వైపు తిరిగి "సారీ సర్" అన్చెప్పి వెళ్ళిపోయాడు.

"సారీ చెప్తున్నాడుగా. యింతటితో వదిలేద్దాం" అన్నాడు కమీషనర్.

"అతను చేసింది సారీ చెప్పటం వల్ల మాసిపోయే తప్పు కాదు. అతని అమానుష ప్రవర్తన వల్ల నా భార్య చనిపోయింది"

కమీషనర్‌గారి ముఖంలో రంగులు వేగంగా మారాయి. "సారీ అన్నాడుగా. యింకేం చేయమంటారు? మీ కాళ్ళు పట్టుకోవాల్నా? ఆర్.. యూ వాంట్ మీ టు హ్యాంగ్ హిమ్ ఫర్ ది స్మాల్ మిస్టేక్ హి డిడ్ ఫర్ విచ్ దేర్ ఈజ్ నో ప్రూఫ్? సారీ. ఐ డిడ్ మై బెస్ట్. మీరిక

వెళ్ళొచ్చు" అన్నాడు.

సారీ ఏమిటి? ఆ పదం వింటేనే వంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లుంది. తప్పు చేసి సారీ చెప్తే సరిపోతుందా... అసలీ పదాన్ని ఉరితీయాలి... దాన్ని మనకు పూతపదంగా మార్చి వెళ్ళిన బ్రిటీష్ పాలకుల్ని ఉరితీయాలి. స్వాతంత్ర్యం వచ్చి యిన్నేళ్ళయినా ఎంగిలి పదాల్ని పట్టుకుని వేలాడుతున్న మన వాళ్ళని ఉరితీయాలి.

ఆవేశం అదుపులో పెట్టుకోలేక కోర్టుగుమ్మం తొక్కాను. కోర్టులో కేసు రెండేళ్ళు నడిచింది. ఆ కానిస్టేబుల్ జరిగినదానికి సారీ చెప్తూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. దాన్ని ఆమోదించడానికి వీల్లేదని నేను వాదించాను.

"మనం రోడ్డు మీద నడుస్తుంటే ఎవరో మనల్ని చూస్కోకుండా డ్యాష్ యిచ్చాడు. మన చేతుల్లోని వస్తువు కింద పడిపోయింది. అపుడతను సారీ అంటే దాన్ని ఆమోదించవచ్చు. యిక్కడ నష్టమేమీ జరగలేదు. ఓ తల్లి తన పొత్తిళ్ళలో నెలల పసికందుని తీసుకెళ్తున్న సమయంలో ఎవరైనా డ్యాష్ యివ్వటం వల్ల ఆ పాప కిందపడి చనిపోతే అప్పుడూ సారీతో సరిపెట్టుకోమంటారా? అందునా పొరపాటున కాకుండా కావాలని డ్యాష్ యిస్తేనో.... నా విషయంలో జరిగింది అదే. వాళ్ళ చేతుల్లో అధికారముందన్న అహంతో నన్ను అనవసరంగా ఆపేశారు. నేను సరైన సమయానికి యిల్లు చేరుకోనుండుంటే నా భార్య బతికుండేది. వాళ్ళ పొరపాటు వల్ల ఓ నిండుప్రాణం బలై పోయింది. నాకు జరిగిన నష్టాన్ని ఎన్ని సారీలతో పూరించగలరు యువరానర్..వాళ్ళు పరోక్షంగా నా భార్యని హత్య చేశారు. అందుకు శిక్ష తప్పకుండా అనుభవించాలి.

యాక్సిడెంట్లో స్కూటర్కో కారుకో నష్టం జరిగితే తప్పు చేసిన వ్యక్తి ఆ నష్టాన్ని భరించటం న్యాయం. యిక్కడ నాకు జరిగిన నష్టం డబ్బుల్తో పూడ్చుకునేది కాదు. అతన్ని శిక్షించటంవల్ల పోయిన నా భార్య తిరిగిరాదు. కానీ దోషిని శిక్షించటం ద్వారా అది మిగతావాళ్ళకి హెచ్చరికలా పన్చేస్తుంది. నా భార్య చావుకి కారణమైన వ్యక్తికి శిక్ష పడటం వల్ల నాకు న్యాయం జరిగిందన్న తృప్తి మిగుల్తుంది.

చిన్న తప్పుకీ పెద్ద తప్పుకీ సారీనే... సారీ అనే పూతపదం వాడేస్తే చాలని ప్రజల్లో నాటుకుపోయిన నమ్మకాన్ని బద్దలు కొట్టాలి యువరానర్.. ఎదుటి వ్యక్తి చెప్పిన సారీని నష్టపోయిన వ్యక్తి ఆమోదిస్తేనే దానికి విలువ. లేకపోతే ఆ సారీకి ప్రయోజనం లేనట్టే.

నేను అతని సారీని ఆమోదించటం లేదు కాబట్టి అతనికి తగిన శిక్ష విధించాలని కోరుతున్నా" అంటూ జడ్జిగారితో మొర పెట్టుకున్నాను.

తీర్పు వెలువడే రోజు వళ్ళంతా చెవులు చేసుకుని కోర్టుహాల్లో కూచున్నాను..

"సదరు కానిస్టేబుల్ పిటీషనర్‌ని అక్రమంగా నిర్బంధించినట్టు రుజువులు లేని కారణంగా పిటిషనర్ భార్య మృతికి ప్రతివాది కారణమని కోర్టు విశ్వసించటం లేదు. ప్రతివాది పోలీస్ కానిస్టేబుల్‌గా తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించే క్రమంలో పిటిషనర్ స్కూటర్ని ఆపటం, డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయో లేవో చూడటం తటస్థించినా, సదరు చర్యల వల్ల పిటిషనర్‌కి మనస్తాపం కలిగిస్తే సారీ అంటూ ప్రతివాది వ్రాతపూర్వకంగా కోర్టువారికి విన్నవించుకున్నదాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఈ కేసుని కొట్టివేస్తున్నాం" అనేది తీర్పు సారాంశం.

'సారీ' అంటే పొరపాటైంది, క్షమించమన్న ఉదాత్తమైన అర్థం కూడా రాదే. అతను చేసిన తప్పువల్ల బాధ పడింది నేను..నష్టపోయింది నేను. ఓ వేళ అతను క్షమించమని అడిగినా క్షమించటం క్షమించకపోవటం అనేది నా యిష్టం కదా. నా ప్రమేయం లేకుండా ఏకపక్షంగా 'సారీ' అనేసినందున అతను చేసిన తప్పు తప్పు కాకుండా పోతుందా... సారీ చెప్తే తప్పు మాఫీ ఐపోతుందని కోర్టు తీర్పివ్వటం తప్పు...

'సారీ' అనే పదం వింటేనే కసి... నిఘంటువులోంచి 'సారీ' అనే పదాన్ని తీసేయాలన్నంత కోపం...

సుప్రీం కోర్టుకెళ్ళాను. కేసింకా నడుస్తోంది.

**(ఆంధ్రభూమి మాస పత్రిక - ఆగస్ట్ 2011)**

**(ఆంధ్రభూమి కథల పోటీలో ప్రత్యేక బహుమతి)**